ములబంద గోడి రైతు మూల సంఘం ఎన్నిక

విశాలాంధ్ర-మునగపాక: స్థానిక సంతబయల వినాయక కల్యాణ మండపంలో ఆదివారం ములబంద గోడి రైతు మూల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు.అధ్యక్షుడుగా దొడ్డి నూకరాజు, కార్యదర్శిగా దాడి శివ నాగ అప్పారావు,కోశాధికారిగా సూరిశెట్టి నాగ దుర్గనాయుడులు ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా కుంది గంగాధర్,దొడ్డి త్రినాథ్ లు ఎన్నికయ్యారు.దాడి సూర్యనారాయణ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి.ఈ సమావేశంలో సంఘం సభ్యులు దాడి శివ,దొడ్డి గంగ సూరి,రామ అప్పలనాయుడు, బొడ్డేడ రామునాయుడు, దాడి శ్రీరామూర్తి, దొడ్డి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదంలో మామిడివాక బ్రిడ్జి

- పరిమితికి మించి భారీ వాహనాల రాకపోకలు
- 20 టన్నులకు మించి అన్రాక్ కంపెనీకి ముడి సరుకు రవాణా
- దెబ్బతిన్న తాళ్లపాలెం నర్సీపట్నం ప్రధాన బ్రిడ్జిని పరిశీలించిన స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

విశాలాంధ్ర - కశింకోట: పరిమితికి మించి భారీ వాహనాలు అత్యధిక లోడుతో రాకపోకలు సాగించడం వల్లే తాళ్లపాలెం నర్సీపట్నం వెళ్లే మామిడిపాక బ్రిడ్జి ప్రమాదంలో పడిందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గత వారం రోజుల క్రితం ఆర్ అండ్ బి అధికారులు బ్రిడ్జి పరిస్థితిని పరిశీలించిన తర్వాత నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. దీనిపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించి బ్రిడ్జి స్థితిగతులను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి ఆదివారం నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. 20 టన్నులు సామర్థ్యంతో ఈ బ్రిడ్జిపై రాకపోకలు సాగించాల్సి ఉండగా సుమారు 60 టన్నులకు పైగా ముడిసరుకు అన్రాక్ కంపెనీకి తరలించడం కారణంగానే ఈ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందని తెలియజేశారు. తక్షణమే బ్రిడ్జి ప్రమాదాన్ని నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆర్ అండ్ బి ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేశామని చెప్పారు. వారం రోజుల్లో సంబంధిత సాంకేతిక నిపుణులతో బ్రిడ్జిని పరిశీలించి వారి సూచనల మేరకు కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలా లేదా మరమ్మతులు చేస్తే సరిపోతుందా అనే అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అంతేకాకుండా తాళ్లపాలెం నుంచి చింతపల్లి వరకు విశాలమైన రోడ్లు నిర్మాణం చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. దీనివల్ల పరిశ్రమలు మన ప్రాంతానికి రావడమే కాకుండా నిరుద్యోగ సమస్య కూడా పరిష్కారం అవుతుందని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ రహదారికి అనుసంధానంగా ఆర్ అండ్ బి రోడ్లన్నీ విస్తరించేందుకు ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేస్తుందని తెలియజేశారు. కాగా అన్రాక్ కంపెనీ 20 టన్నులకు మించి వాహనాలను రవాణా చేస్తే కంపెనీకి తాళం వేస్తానని అయ్యన్న హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, ఆర్ అండ్ బి సూపరింటెండెంట్ ఇంజనీర్ జాన్ సుధాకర్, అనకాపల్లి ఏఈ ఎన్. సాంబశివరావు, నర్సీపట్నం డిఈ ఆర్ఆర్ విద్యాసాగర్, పెద్ద బొడ్డేపల్లి అసిస్టెంట్ ఇంజనీర్ కె. నారాయణరెడ్డి, నర్సీపట్నం అసిస్టెంట్ ఇంజనీర్ ఎన్ ఎల్ నాయుడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కాయల మురళీధర్, ఉగ్గిని రమణమూర్తి, వేగి గోపికృష్ణ, కుటమి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

సైతారుపేట చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని సైతారు పేట గ్రామంలోని సాగునీటి చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో గ్రామంలో అధికార పార్టీకి చెందిన వారు రోడ్డు నిర్మాణం కొరకు ఎటువంటి అనుమతులు తీసుకోకుండా మసీదు ట్యాంక్ అనే చెరువులో జెసిబి సహాయంతో ట్రాక్టర్ల పై మట్టిని తరలించారు. ఆదివారం కావడంతో అధికారులు ఎవరూ అందుబాటులో ఉండరని అనుమతి లేకపోయినా మట్టిని తరలించవచ్చని ఉద్దేశంతో తవ్వకాలు చేయడం జరిగిందని పలువురు విమర్శిస్తున్నారు. ఇరిగేషన్ ఏఈ భానును వివరణ కోరగా చెరువులో మట్టి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని దీనిపై చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

మంత్రి పర్యటనలో ముఖం చాటేసిన జన సైనికులు

విశాలాంధ్ర - చోడవరం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలన తొలి అడుగు' ప్రారంభ కార్యక్రమానికి చోడవరం విచ్చేసిన రాష్ట్ర సాగునీటి వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటనకు జన సైనికులు మొహం చాటేశారు. ఒక్క బి.జె.పి. నాయకులు కందర్ప రమణ మూర్తి తప్ప మిగిలిన నాయకులు కూటమి ప్రభుత్వ పాలన సంబరాల్లో పాల్గొనక పోవడంతో రాజకీయ వర్గాల్లో

చర్చనీయాంశం అయింది. ఇదే సమయంలో నియోజకవర్గంలోని కొత్తకోట గ్రామంలో జనసేన నియోజకవర్గ ఇన్చార్జి పి.వి.ఎస్.ఎన్. రాజు ఇంట నామినేటెడ్ పదవుల సంబరం కొనసాగడం.... రాష్ట్ర మంత్రి పర్యటన కన్నా ముఖ్యమేమో అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

డ్రైవర్ల విశ్రాంతి భవనాన్ని పరిశీలించిన బ్రహ్మానందరెడ్డి

విశాలాంధ్ర - యలమంచిలి: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ పై భాగంలో నైట్ హాల్ట్ ఉండే డ్రైవర్లు విశ్రాంతి భవనం 29 లక్షలతో నిర్మాణం పూర్తిచేసి 22వ తేదీన ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేస్తుండగా ఈ భవనాన్ని పరిశీలించేందుకు ఆర్టీసీ జోన్1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మానంద రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం ఈ విశ్రాంతిభవన ప్రారంభోత్సవానికి రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, రాష్ట్ర రోడ్లు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్పర్సన్ ప్రగడ నాగేశ్వరావులు హాజరవుతారని అన్నారు. కార్యక్రమంలో డీపీటీవో ప్రవీణ, పివీ నరసింహారావు, అనకాపల్లి అసిస్టెంట్ మేనేజర్ గౌరీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో సైతారు పేట గ్రామంలోని విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. నిత్యం ప్రజలు సంచరించే చెరువుగట్టు సమీపంలో పూర్వం ఒక విద్యుత్ స్తంభం వేశారు. దానిపై బరువు పెరగడంతో దానికి సపోర్టుగా మరో రెండు స్తంభాలను పెట్టడం జరిగింది. ప్రతిష్ఠంగా ఉండవలసిన విద్యుత్ స్తంభం ఇలా ఉండడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు ఈ స్తంభాల స్థానంలో ప్రతిష్టమైన స్థంభం వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణికులకు బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - అచ్యుతాపురం: ప్రయాణికులకు అన్ని వసతులతో బస్ షెల్టర్లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. ఆదివారం ఎస్టిబిఎల్లో గల ఎమ్మెల్యే నివాసంలో విజయనగరం జోన్ -1 ఈడి కె.బ్రహ్మానందరెడ్డి, అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా అధికారి వి.ప్రవీణ (ఎపిఎస్ఆర్ టిసి) ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో గల నాలుగు మండలాలలో ఉన్న బస్ స్టాప్ ల వద్ద ప్రయాణికులకు అన్ని వసతులు కల్పించాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బస్సులు నడపాలన్నారు.

కోలాటం మహిళలకు చీరలు వితరణ

విశాలాంధ్ర- సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి గ్రామానికి చెందిన లగుడు ముత్యాలనాయుడు కుమారుడు లగుడు రవికుమార్ సొంత నిధులతో సమకూర్చిన చీరలను గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, మాజీ ఎంపీపీ

సబ్బవరపు ముత్యాల నాయుడు చేతుల మీదుగా శ్రీ సీతారామాంజనేయ కోలాటం మహిళలకు శనివారం రాత్రి అందజేశారు. ఈ సందర్భంగా లగుడు రవికుమార్ కి కోలాట బృందం వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గొర్లి అప్పారావు, వార్డ్ మెంబర్ జి. కాసులమ్మ, గొర్లి ఎర్రి నాయుడు, సిహెచ్ గౌరీ శంకర్, బోకం జగదీష్, జి.ఉదయ్ భాస్కర్ ఎం. నాయుడు, జి. అప్పలనాయుడు, లగుడు ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

విశాలాంధ్ర - పరవాడ: జాతీయ రహదారి లంకెలపాలెం కూడలిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. లంకెలపాలెం రంగనాయక నగర్ కాలనీకి చెందిన దాసరి ఆదిలక్ష్మి(60) రోడ్డు దాటుతుండగా

గాజువాక నుండి అనకాపల్లి వైపు వెళున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇటీవల కాలంలో ఈ కూడలిలో జరుగుతున్న వరుస ప్రమాదాలు స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. ప్రమాదాల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జనసేనాని స్ఫూర్తితో జన సైనికుడి ఔదార్యం

పొట్టిదొరపాలెంలో మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: మండలంలోని పొట్టి దొరపాలెం గ్రామపంచాయతీ పరిధిలో జనసేన

పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బాబురావు తన మానవత్వాన్ని చాటుకుంటున్నారు. గ్రామంలో ఎవరు చనిపోయిన తన వంతుగా ప్రతి ఒక్కరికి ఆర్థిక సాయం చేస్తూ ఓదార్పు నిచ్చే అలవాటు ఉన్న బాబురావు జనసేన అధ్యక్షులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో నియోజకవర్గం ఇంచార్జి పివిఎస్ఎన్ రాజు సమక్షంలో తాజాగా ఆదివారం గ్రామానికి చెందిన ఇటీవల మృతి చెందిన ఆరు కుటుంబాలకు ఆర్థికసాయాన్ని అందజేశారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ఇన్చార్జి పి వి ఎస్ ఎన్ చేతుల మీదుగా ఆర్థిక సాయం చేసారు. కార్యక్రమం లో పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

ఘనంగా బురదమాంబ పండగ

విశాలాంధ్ర - యలమంచిలి: మున్సిపాలిటీ పరిధిలో తెరువుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ బురద మాంబ అమ్మవారి పండగ ఆదివారం నాడు గ్రామస్తులంతా భక్తి శ్రద్ధలతో చేసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ

అమ్మవారిని దర్శకంచుకునేందుకు గ్రామస్తులంతా పసుపు కుంకుమ చీర రవిక నైవేద్యాలతో ఉదయం 5 గంటల నుండి గుడి వద్ద బారుతీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీసుకున్నారు. కమిటీ వారు భక్తులకు అసౌకర్యం క్యూలైన్లు ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదాలు. శాసనసభ్యులతో పాటు స్థానిక జనసేన నాయకులు బోజ జయరాం, కౌన్సిలర్ శ్రీను, టిడిపి నాయకులు పిల్లా సత్యనారాయణ, కాశి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు భూములిచ్చేది లేదు

నిరసన వ్యక్తం చేసిన జానకియ్యపేట గ్రామస్తులు

విశాలాంధ్ర - నక్కపల్లి: మండలంలో సిహెచ్. ఎల్.పురం రెవెన్యూ పరిధిలోని జానకియ్యపేటలో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు భూములు ఇచ్చేది లేదని జానకియ్యపేట గ్రామస్తులు తెగేసి చెప్పారు. ఆదివారం జానకియ్యపేట శ్రీక్రిష్ణ దేవాలయంలో సమావేశం ఏర్పాటు చేసుకుని తీర్మానం చేసి అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైసీపీ మండల అధ్యక్షులు సీరం నరసింహమూర్తి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ జానకియ్యపేట గ్రామంలో చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయం, గొర్రెలు, మేకలు పెంపకంపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఇక్కడ భూములు అన్నీ సారవంతమైన భూములు, తోటలు ఇటువంటి భూములలో ఎటువంటి పరిశ్రమలు ఏర్పాటు చేయవద్దని 2013 భూ సేకరణ చట్టం చెబుతున్నా దానిని పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నోటిఫికేషన్ జారి చేసిందన్నారు. ఈ గ్రామంలో రైతులు బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేరని తెలిపారు. రైతుల, కూలీలు మనోభావాలను, జీవనోపాధిని దృష్టిలో పెట్టుకుని బల్క్ డ్రగ్స్ ఏర్పాటు కొరకు భూసేకరణకు ఇచ్చిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులను సమీకరించి ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కురందాసు సింహాచలం,కు రాందాసు అప్పలరాజు, కురాందాసు నానాజీ, మామిడి బాబ్జీ,దేవర సత్తిబాబు, తులసీరావు, మామిడి రమణ, మామిడి కృష్ణ,దేవర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తొలి ఏడాదిలోనే కూటమి చక్కని పాలన అందించింది

విశాలాంధ్ర - మునగపాక: అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం చక్కని పాలన అందించిందని రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షులు పెంటకోట విజయ్ అన్నారు.మండలంలో ఒంపోలు గ్రామంలో "సువరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిలోనే ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చారన్నారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంని తెలిపారు. ముఖ్యంగా తల్లికి వందనం,పింఛన్లపై ప్రజలు సంతోషంగా ఉన్నారు. మా పెద్ద కొడుకులా చంద్రబాబు ఆదుకుంటున్నారని వృద్ధులంటున్నారన్నారు. ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా వృద్ధులకు 4 వేల పెన్షన్ అందచేస్తున్నామని వికలాంగులకు 3వేల పెన్షన్ని 6వేలకి పెంచి ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ అందిస్తున్నమన్నారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,త్వరలో రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి ఒక్కొక్కరికి 20 వేల రూపాయలు వేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉల్లింగల గోవిందు, మండల తెలుగు యువత అధ్యక్షులు ఉల్లింగల సంతోష్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రముఖ పారిశ్రామిక వేత్త బోకం శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, యువ నాయకుడు బోకం శ్రీనివాస్ జన్మదిన వేడుకలు సర్పంచ్ బోకం స్వామి నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లక్ష్మీ ఎంటర్ప్రైజెస్ అధినేత, పారిశ్రామికవేత్త చొక్కాకుల వెంకటరావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి చొక్కాకుల వెంకటరావు, శ్రీనివాస్ తల్లిదండ్రులు అప్పలనాయుడు నారాయణమ్మ దంపతులు పుట్టినరోజు కేకును కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. పుట్టినరోజును పురస్కరించుకొని మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, గ్రామ పంచాయతీ అభివృద్ధికి 50 వేలు రూపాయలు, గ్రామంలో 150 కుటుంబాలకు 25 కేజీల బియ్యం బస్తాలను అందజేశారు. అలాగే శ్రీనివాస్ సొంత నిధులతో గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, కర్రి కనకరాజు, ఉప సర్పంచ్ వనం దేముడు బాబు,రొంగలి దేముడు, బైలపూడి హరి గోపాల్, శ్రీరం అప్పలరాజు, అక్కిరెడ్డి దుర్గి నాయుడు,గొర్లి నూకరాజు, పైల వెంకట రమణ, పంచాడ శ్రీనివాసరావు, ఆకుల గణేష్, జెట్టి ప్రసాద్, హేమంత్, పల్లి మంగ రాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేజే.పురంలో మోదకొండమ్మ పండుగ

విశాలాంధ్ర - వి. మాడుగుల: మాడుగుల మండలం కేజే.పురం గ్రామ దేవత శ్రీమోదకొండమ్మ పండుగను ఆదివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారిని భారీ ఎత్తున భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేసుకుందాం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-రాంబిల్లి: మండలం లాలంకోడూరు గ్రామస్తులుతో ఆదివారం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్గీయ లాలం భాస్కరరావు అంటే ఆయనకు చాలా గౌరవం, అభిమానం అంటూ వారి కుటుంబంతోనూ, భాస్కరరావు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తాను టీడీపీ ఇన్చార్జ్గా ఉన్నప్పుడు లాలం బాస్కర్ రావుకు జిల్లా పరిషత్ చైర్మన్గా అవకాశం ఇవ్వాలని ప్రతిపాదన పెట్టానన్నారు. మన గ్రామాన్ని కాపాడుకుందామని, గ్రామానికి కావల్సిన రోడ్లు, త్రాగునీరు, డ్రైనేజీలను మరింతగా అభివృద్ధి చేసుకుందామన్నారు.గ్రామాన్ని తరలించడం అనే అంశానికి గ్రామస్తులంతా ఒక కమిటీని ఏర్పరుచుకుని తాము నిర్ణయించుకున్న అంశాలను ఎమ్మెల్యే తెలియజేయమన్నారు.కానీ సొంత గ్రామాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నం చేద్దామన్నారు. ప్రపంచీకరణ చెందుతున్న సమయంలో మనం కూడా ప్రపంచంలో మనల్ని మనం గెలిపించుకుని, ఉత్తమ స్థానానికి చేరుకునేలా మన ఆలోచన జ్ఞానం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పి చైర్పర్సన్ లాలం భవానీ భాస్కర్, వైస్ ఎంపిపి కసిరెడ్డి నర్సింహారావు, జనసేన మండలాధ్యక్షులు పప్పల నూకన్న దొర,టిడిపి సీనియర్ నాయకులు వసంతవాడ దిన్ బాబు, డిఎస్ఎన్ రాజు, టిడిపి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన సచివాలయ సిబ్బందికి స్వాగతం

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం పొంగలిపాక గ్రామ సచివాలయానికి నూతనంగా విధుల్లో చేరిన సిబ్బందికి స్వాగతం పలుకుతూ ఇక్కడ నుంచి బదిలీ అయిన సిబ్బందికి వీడ్కోలు పలికే కార్యక్రమంను ఎంపిడిఒ కొంకి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నాయన సత్యనారాయణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఉండూరు దేవుడు ప్రోత్సాహంతో గ్రామ ప్రజలందరికీ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. నూతనంగా వచ్చినవారు మాకవరపాలెం మండలం నుంచి పంచాయతీ సెక్రెటరీ కూడా ప్రసాదరావు, కసింకోట మండలం నుండి డిజిటల్ అసిస్టెంట్ గుండాల స్రవంతి, రోలుగుంట మండలం నుంచి అగ్రికల్చర్ అసిస్టెంట్ గట్టా సూర్యగణేష్, బుచ్చయ్యపేట మండలం నుంచి షేక్ మొహమ్మద్ అబ్దుల్ అమనుల్లా, చీడికాడ మండలం నుంచి సర్వేయర్ జెడ్డి ప్రభావతి దేవి, ఎల్.పొన్నూరు పంచాయతీ నుంచి ఏఎన్ఎం రొబ్బా మంగ తల్లి జాయిన్ అవ్వడం జరిగింది. ఈ గ్రామంలో పనిచేసిన నాగేశ్వరరావు శ్రీను మాస్టర్లకి అభినం దనలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పొంగలి పాక ఎంపిటిసి మైసర్ల సన్యాసిరావు, నీటి సంఘం అధ్యక్షులు బంటు మల్లు నాయుడు, పచ్చికూర ఇరుకు నాయుడు, పాలసొసైటీ అధ్యక్షుడు నాయనా జోగినాయుడు, స్కూల్ కమిటీ అధ్యక్షుడు దాంట్లో రవి, జనసేన కార్యకర్తలు ఉండూరు కుమార్, పచ్చికూర నాగు, వీఆర్వో కుమారి, వెలుగు పచ్చికొర నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ఉండూరు భాస్కరరావు, వార్డు మెంబర్లు గొంది రాజు, గనివాడ సన్యాసిరావు, ఉండూరు దేవుళ్ళు, స్కూలు టీచర్లు వీర్రాజు, వసంత కుమారి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

విశాలాంధ్ర - సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత రావిపల్లి నాయుడు కుమారుడు పైడంనాయుడుకు పెందుర్తి టీడీపీ ఇన్చార్జి గండి బాబ్జి చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆదివారం అందజేశారు. అయితే రావిపల్లి పైడం నాయుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని స్థానిక పిఎసిఎస్ చైర్మన్ గండి దేముడు తెలుసుకొని పెందుర్తి టిడిపి ఇన్చార్జ్ గండి బాబ్జికి తెలిపారు. దీనికి స్పందించిన బాబ్జి సీఎం సహాయ నిధి నుంచి రూ.2,01,607 లక్షలు మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన చెక్కును మొగలిపురం గ్రామంలో గండి బాబ్జి లబ్ధిదారుడు రావిపల్లి పైడంనాయుడుకు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ గండి దేముడు, మండల తెలుగు యువత అధ్యక్షులు బలిరెడ్డి అప్పారావు, బలిరెడ్డి సూర్యప్రసాద్, బలిరెడ్డి అప్పారావు, బలిరెడ్డి రాము, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు రూ.2 లక్షలు ఆర్థికసాయం

విశాలాంధ్ర - సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త బోకం శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు పురస్కరించుకొని నూతనంగా నిర్మించిన పలు ఆలయాలకు రూ.2 లక్షలు వితరణ చేశారు. సబ్బవరం మేజర్ పంచాయతీలో నూతనంగా నిర్మించిన శివాలయానికి లక్ష రూపాయలు, టెక్కలి పాలెం రామాలయానికి 50వేల రూపాయలు, వంగలి రామాలయానికి 50వేల రూపాయలు ఆయా ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు చొక్కాకుల వెంకటరావు, గ్రామ సర్పంచ్ బోకం స్వామి నాయుడు, మండల నాయకులు చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా బోకం శ్రీనివాసరావు, స్వామి నాయుడుకి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు కర్రీ కనకరాజు, బర్ల రమణ, కోరాడ శ్రీనివాసరావు, గెద్దం కృష్ణ, బంతికోళ్ల పద్మ, కిల్లి వెంకట సత్య నారాయణ, గొర్లి కుమార్, టి.శేఖర్, మంగరాజు, ఆలయ కమిటీ నిర్వాహకులు, మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.

సి.ఎం. రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

విశాలాంధ్ర - చోడవరం: ముఖ్యమంత్రి సహాయ నిధి కింద విడుదలైన నిధులను ఆదివారం చోడవరం టీడీపీ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు చేతుల మీదుగా 13 మందికి అందజేశారు. చోడవరం నియోజకవర్గ పరిధిలో సుమారు 13 మందికి సి.ఎం. సహాయ నిధి నుంచి రూ.9,53,869 లు. చెక్కులను ఎమ్మెల్యే రాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో రావికమతం మండల పార్టీ అధ్యక్షుడు శంకర్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డెడ గంగాధర్, పుల్లేటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీలా తులసీరామ్ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - అచ్యుతాపురం: మండల టీడీపీ అధ్యక్షులు పీలా తులసీరామ్ పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలో రావిపాలెం గ్రామంలో సువరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం అనంతరం తులసీరామ్కు మాజీ పార్లమెంట్ సభ్యులు వప్పల చలపతిరావు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ రాజాన నానాజీ, లాలం రాము, పతివాడ చిన్నయ్యనాయుడు, తమరాల తాతబాబు, బంటు పిల్లి అప్పారావు, లోకనాదం నాగరాజు, టీడీపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మిస్ వైజాగ్ సీజన్-5 శ్రావణ లక్ష్మిగా తన్వి సుచరిత

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: సీజన్-5 మిస్ వైజాగ్ శ్రావణ లక్ష్మి విజేతగా తన్వి సుచరిత నిలిచింది.ఉషారాణి క్వీన్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో వైజాగ్ సీఎంఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన మిస్ శ్రావణి లక్ష్మి పోటీలకు 13 మందిని ఎంపిక చేశారు. బుచ్చెయ్యపేట మండలంలోని తురకలపూడి పీహెచ్సీ వైద్యాధికారిణి డాక్టర్ సంధ్యారాణి కుమార్తె తన్వి సుచరిత ఈ పోటీలలో విజేతగా గెలుపొందింది. చివరి రౌండ్ వరకు పోటీలు ఉత్కంఠ భరితంగా సాగి చివరకు తన్వి ఎంపిక అయ్యింది తన్వి ఇంటర్మీడియట్

చదువుతుంది ఈ సందర్భంగా వైద్యాధికారి సంధ్యారాణి మాట్లాడుతూ పిల్లలకు విద్యతోపాటు వారికి ఇష్టమైన రంగాలలో ప్రోత్సహిస్తే మరింత ఉన్నతంగా రాణిస్తారని అన్నారు. తెలుగు సాంస్కృతిక సాంప్రదాయాలకు ప్రతీకగా ఈ పోటీలు నిలుస్తాయన్నారు. పాశ్చాత్య సాంప్రదాయాలకు అలవాటు పడుతున్న నేటి కాలంలో మన తెలుగు తనాన్ని గుర్తు చేసే విధంగా మన పిల్లలను ప్రోత్సహించాలన్నారు.మన తెలుగు సాంప్రదాయాలను కట్టుబాట్లను గౌరవించాలన్నారు.ఈ సందర్భంగా మిస్ శ్రావణ లక్ష్మి విజేత తన్వి సుచరితను పలువురు అభినందించారు.